

పెద్దమ్మతల్లికి బోనం

సిరిసిల్లటౌన్: జిల్లా కేంద్రంలో శనివారం ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో పెద్దమ్మతల్లికి బోనాలు తీశారు. వందలాది సంఖ్యలో మహిళలు బోనాలతో తరలివచ్చారు. ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు కీసరి నాగరాజు, గౌరవ అధ్యక్షుడు కరుణాల భద్రాచలం, ఉపాధ్యక్షుడు కర్ల పర్శరాములు, కోశాధికారి చెన్న మనేని శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి నూనె శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

ఖాళీల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

- కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

సిరిసిల్ల: జిల్లాలోని మహిళా శిశు సంక్షేమశాఖలో 4, సఖీ కేంద్రంలో 13 పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా శనివారం కోరారు. ప్రభుత్వ వయోవృద్ధుల ఆశ్రమంలో 4 పోస్టులు... శానిటేషన్ వర్కర్, నైట్ వాచ్‌మెన్, అకౌంటెంట్, అసిస్టెంట్ కుక్ పోస్టులను భర్తీ చేస్తామని తెలిపారు. సఖీ కేంద్రంలో 13 పోస్టులు ఖాళీగా ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. సఖీ సెంటర్ అడ్మినిస్ట్రేటర్, లీగల్ కౌన్సిలర్, సైకో సోషల్‌కౌన్సిలర్, కేసు వర్కర్ డాటా అనలిస్ట్ కం అకౌంటెంట్ కం కంప్యూటర్ స్పెషలిస్ట్, పారామెడికల్, సెక్యూరిటీగార్డు, మల్టీ టాస్క్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. వేతనం, అర్హతలు జిల్లా వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని వివరించారు. జిల్లా వెబ్‌సైట్ నుంచి అప్లికేషన్ ఫామ్ డౌన్‌లోడ్ చేసుకొని, జిల్లా సంక్షేమాధికారి కార్యాలయంలో అప్పగించాలని కోరారు.

ఆకట్టుకున్న గోల్డ్ జ్యువెల్లరీ ఎగ్జిబిషన్



సిరిసిల్లటౌన్: ప్రముఖ నగల తయారీసంస్థ జోయాలుక్కాస్ సిరిసిల్ల పట్టణంలోని వాసవి కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన నగల ప్రదర్శనశాలను శనివారం మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ ప్రారంభించారు. ప్రజల సందర్శనార్థం సిరిసిల్ల పట్టణంలో శనివారం నుంచి మూడు రోజులపాటు ఎగ్జిబిషన్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కౌన్సిలర్లు, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

కార్పొరేట్లకు కొమ్ముకాస్తున్న బీజేపీ

- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి




సిరిసిల్లటౌన్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్లకు కొమ్ముకాస్తోందని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి విమర్శించారు. జిల్లా కేంద్రంలోని కార్మిక భవన్‌లో శనివారం నిర్వహించిన పార్టీ నేతలు బాలమల్లేశ్, పోటు ప్రసాద్ సంస్మరణ సభకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దేశంలోని అవినీతి కుంభకోణాలపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాదిలో ఏం చేశారని సంబరాలు చేసుకుంటున్నారని ప్రశ్నించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు, కార్యవర్గ సభ్యులు పంతం రవి, మీసం లక్ష్మణ్, కడారి రాములు, జిల్లా కౌన్సిల్ సభ్యులు, కేవీ అనసూయ, మల్లేశం, తిరుపతిరెడ్డి, విజయ్, రంజిత్, లక్ష్మి, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు



ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు అని జిల్లా గ్రంథాలయ చైర్మన్ నాగుల సత్యనారాయణగౌడ్ పేర్కొన్నారు. ఎల్లారెడ్డిపేట కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం సన్మానించారు. సత్యనారాయణగౌడ్ మాట్లాడుతూ నిరుద్యోగులు ప్రస్తుతం పోటీపరీక్షలకు అన్ని రకాల పుస్తకాలు కొని చదువలేని పరిస్థితులున్నాయన్నారు. గ్రంథాలయాల్లోని పుస్తకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, పార్టీ మండల అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, నాయకులు గౌస్, లింగంగౌడ్, గిరిధర్‌రెడ్డి, రాంరెడ్డి, బాలయ్య, శ్రీనివాస్, చెన్ని బాబు, దేవయ్య, నంది కిషన్, గుర్రం రాములు, సుధాకర్‌గౌడ్, ఏలూరి రాజయ్యపాల్గొన్నారు.

17వ బెటాలియన్ కమాండెంట్‌గా గంగారాం



సిరిసిల్లక్రైం: సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని 17వ బెటాలియన్ కమాండెంట్‌గా టి.గంగారాం విధుల్లో చేరారు. ఇప్పటి వరకు విధులు నిర్వర్తిస్తున్న కమాండెంట్ ఎస్.శ్రీనివాసరావు బదిలీపై 3వ బెటాలియన్‌కు వెళ్లారు.

పోలీస్ కావాలని..



సండే స్పెషల్

- కలలు కన్నారు.. కొలువు కొట్టారు

పోలీస్ కావాలన్నది వారి కల. ఖాకీ డ్రెస్ వేసుకుంటే ఆ ఫీలింగే వేరు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఉన్నత చదువులు చదివిన వారు సైతం రూ.లక్షల జీతం ఇచ్చే కార్పొరేట్ ఉద్యోగాల వైపు వెళ్లకుండా సర్కారు నౌకరి వైపు ఆసక్తి చూపుతున్నారు. ప్రభుత్వ ఉద్యోగం సాధిస్తే భవిష్యత్‌కు భరోసా ఉంటుందనే నమ్మకంతో కష్టపడుతున్నారు. అలా కష్టపడి పోలీస్ కొలువు కొట్టిన నూతన కానిస్టేబుళ్లు ఉమ్మడి జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లలో విధుల్లో చేరారు. వీరిలో చాలామంది ఉన్నత చదువులు చదివిన వారు ఉండగా.. మరికొందరు వారి కుటుంబంలోని వారిని స్ఫూర్తిగా తీసుకున్నారు. పేద కుటుంబం నుంచి వచ్చి పోలీస్ కొలువు కొట్టి.. ఆదర్శంగా నిలిచారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో విధుల్లో చేరిన పలువురు కానిస్టేబుళ్లపై సండేస్పెషల్..!!

- 8లో▸

కల్లోలిత ప్రాంతం నుంచి..



సిరిసిల్లక్రైం: మాది వ్యవసాయం కుటుంబం. అమ్మానాన్న లక్ష్మి–లచ్చయ్య పొలం పనులు చేస్తారు. బీటెక్ పూర్తవగానే ప్రభుత్వ ఉద్యోగానికి ప్రయత్నాలు చేసిన. అన్నయ్య టీఎస్ఎస్‌పీ కానిస్టేబుల్‌గా ఉన్నారు. ఎస్సై ఉద్యోగం కోసం పరీక్ష రాస్తానని చెబితే ప్రోత్సహించి కరీంనగర్‌లోని ఓ అకాడమీలో చేర్పించారు. ఎస్సై రాకపోయిన కానిస్టేబుల్ వచ్చింది. తొలి ప్రయత్నంలో రావడం, ఇంట్లో ఇద్దరం పోలీసులం ఉండడంతో తల్లిదండ్రులకు ఆనందంగా ఉంది. కరీంనగర్‌లో శిక్షణ పూర్తయింది. సిరిసిల్ల టౌన్‌లో విధుల్లో చేరిన. ఎస్సై కోసం ప్రయత్నిస్తా. ఒకప్పుడు కోనరావుపేట అంటేనే కల్లోలిత నక్సలైట్ ప్రాంతం. కానీ ఇప్పుడు తీరు మారింది. పోలీసు ఉద్యోగం చేయడానికి తల్లిదండ్రులు ఒప్పుకుంటున్నారు. నాలాగా మరింత మంది పోలీసు డ్యూటీలోకి రావాలని ఆకాంక్ష.

– కె.శిరీష, కోనరావుపేట

ప్రమాదాలకు చెక్

- బ్లాక్‌స్పాట్ల వద్ద నివారణ చర్యలు
- చౌరస్తాల్లో త్రీడీ యానిమేటెడ్ ఫొటోలు
- వేగ నియంత్రణకు జీబ్రాలైన్స్
- ఆరు నెలలుగా తగ్గిన ప్రమాదాలు



ఎల్లారెడ్డిపేట మండలంలో జీబ్రాలైన్స్ ఏర్పాటు చేస్తున్న పోలీసులు

బోయినపల్లి(చొప్పదండి): ప్రమాదాల నివారణే లక్ష్యంగా జిల్లా పోలీస్‌శాఖ ముందుకెళ్తోంది. వేగ నియంత్రణపై దృష్టి పెడుతూనే ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను గుర్తిస్తూ నివారణ చర్యలు తీసుకుంటున్నారు. జిల్లా ఎస్పీ అఖిల్‌మహాజన్ మార్గదర్శకాలతో బ్లాక్‌స్పాట్స్(ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలు) గుర్తించడంతోపాటు వేగ నియంత్రణకు జీబ్రాలైన్స్ ఏర్పాటు చేస్తున్నారు. చౌరస్తాలో త్రీడీ యానిమేటెడ్ పిక్చర్స్‌తో ప్రమాదాల నివారణ చర్యలు తీసుకుంటున్నారు.

బ్లాక్ స్పాట్లు ఇవీ..

- కరీంనగర్–సిరిసిల్ల ప్రధాన రహదారిలో సిరిసిల్ల పట్టణంలోని గోపాల్‌నగర్‌చౌరస్తా, జిల్లా కేంద్రం శివారులోని రగుడుచౌరస్తా, చంద్రంపేట, అగ్రహారం, పెద్దూర్, బోయినపల్లి మండలం కొదురుపాక ఎక్స్‌రోడ్డు, వేములవాడ నాంపల్లి, నంది కమాన్‌చౌరస్తా, జగిత్యాల దారిలో శాత్రాజీపల్లి, చందుర్తి మర్రిగడ్డ, ఎల్లారెడ్డిపేట పదిర క్రాస్ రోడ్ ఇలా జిల్లాలో సుమారు 13 ప్రాంతాలను ఎస్పీ అఖిల్ మహాజన్ ఆధ్వర్యంలో పోలీసులు బ్లాక్‌స్పాట్లుగా గుర్తించారు.
- ఎల్లారెడ్డిపేట మండలంలో 11 డేంజర్‌స్పాట్లను గుర్తించి రక్షణ చర్యలు చేపడుతున్నారు.

త్రీడీ యానిమేటెడ్ ఫొటోస్..జీబ్రాలైన్స్

సిరిసిల్ల పట్టణం శివారులోని రగుడు చౌరస్తా, బోయినపల్లి మండలం కొదురుపాక చౌరస్తాల్లో వాహనాల వేగ నియంత్రణకు త్రీడీ యానిమేటెడ్ పెట్రోకార్, బ్లూకోల్ట్స్ అధికారి ఫొటోలను గతేడాది డిసెంబర్‌లో ఏర్పాటు చేశారు. దూరం నుంచి ఈ యానిమేటెడ్ ఫొటోలను చూసి.. పోలీస్ విధులు నిర్వర్తిస్తున్నారని భావించి నెమ్మదిగా వచ్చే అవకాశం ఉంటుంది. దీంతో ప్రమాదాలు తగ్గుతాయి. పలు ఠాణాల పరిధిలో వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు మూలమలుపులు, అప్రోచ్‌రోడ్ల వద్ద బారికేడ్లు, రబ్బర్ స్ట్రిప్స్, సైన్‌బోర్డులు, స్పీడ్‌బ్రేకర్లు ఏర్పాటు చేస్తున్నారు. ఎల్లారెడ్డిపేట, రాచర్లగొల్లపల్లి, వెంకటాపూర్, సిరిసిల్ల–కామారెడ్డి ప్రధాన రహదారుల్లో ప్రమాదాలు జరుగకుండా రూ.6.60లక్షల ఖర్చుతో ఆరు లేయర్లతో జీబ్రా లైన్స్ వేస్తున్నారు. బోయినపల్లి మండలం వెంకట్రావుపల్లి, కొదురుపాక, స్తంభంపల్లి, చందుర్తి మండలంలోని రోడ్లపై జీబ్రాలైన్స్ వేయిస్తున్నారు.



కొదురుపాక చౌరస్తాలో పోలీస్ బొమ్మ

తగ్గిన ప్రమాదాలు

గతేడాది డిసెంబర్ నెలకు ముందు ప్రధాన రహదారులైన కొదురుపాక, రగుడు చౌరస్తా పరిసరాల్లో సుమారు 36 వరకు ప్రమాదాలు జరిగినట్లు పోలీస్ రికార్డులు చెబుతున్నాయి. పోలీసులు వేగ నియంత్రణ చర్యలు తీసుకున్న తర్వాత గత ఆరు నెలలుగా మేజర్ ప్రమాదాలు తగ్గిపోయాయి.

ప్రమాదాల నివారణకు చర్యలు



వాహనాల వేగం తగ్గించి ప్రమాదాల నివారణ చర్యలు తీసుకుంటున్నాం. జిల్లా పరిధిలో 13 బ్లాక్‌స్పాట్లు గుర్తించాం. ప్రధానచౌరస్తాల్లో యానిమేటెడ్ పెట్రోకార్ బ్లూకోల్ట్స్ అధికారి ఫొటోలు ఏర్పాటు చేశాం. దీని ద్వారా ప్రమాదాలు చాలా వరకు తగ్గాయి. గతేడాది డిసెంబర్‌కు ముందు 36 వరకు ప్రమాదాలు జరిగాయి. ఆరు నెలలుగా మేజర్ ప్రమాదాలు జరుగలేదు. ప్రయాణికులు రోడ్డు భద్రత చర్యలు పాటించాలి. మద్యం సేవించి వాహనాలు నడుపవద్దు. వేగ నియంత్రణ ఉండాలి.

– అఖిల్ మహాజన్, ఎస్పీ

నేతన్నల అభ్యున్నతికి కృషి

- కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుంది
- 90 శాతం సబ్సిడీపై యారన్
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



చేనేత కార్మికుడిని సన్మానిస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

సిరిసిల్ల: నేతన్నల అభ్యున్నతికి ప్రజాప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో శనివారం చేనేత, జౌళిశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజాపాలన ప్రజావిజయోత్సవాల్లోని పాల్గొని మాట్లాడారు. ప్యాకేజీ–9 పనులు, శ్రీపాద ఎల్లంపల్లి పనులు వేగవంతం చేస్తున్నట్లు తెలిపారు. నేతన్నలకు గత ప్రభుత్వం బకాయిపడ్డ రూ.370 కోట్లు చెల్లించామన్నారు. త్రిఫ్ట్ కింద రూ.36.44 కోట్ల సబ్సిడీ, నేతన్న బీమాకు రూ.2.15కోట్లు, కార్మికుల నూలు సబ్సిడీగా రూ.6.32కోట్లు అందించామని వివరించారు. మహిళలకు రెండు చీరలు అందించే ఆర్డర్‌ను నేతన్నలకు ఇస్తామన్నారు. కుట్టుశిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లు, టెక్స్‌పోర్ట్ కంపెనీలో ఉద్యోగాలు పొందిన మహిళలకు నియామకపత్రాలు అందజేశారు. చొప్పదండి, మానకొండూర్ ఎమ్మెల్యేలు మేడిపల్లి సత్యం, కవ్వంపల్లి సత్యనారాయణ, కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా, అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, ఏఎంసీ చైర్‌పర్సన్ స్వరూప, టెస్కో జీఎం అశోక్‌రావు, చేనేత జౌళి శాఖ ఏడీ సాగర్, పరిశ్రమలశాఖ ఏడీ భారతి పాల్గొన్నారు.

వేములవాడరూరల్: నేతన్నలను గత ప్రభుత్వం ఆగం చేసిందని, కాంగ్రెస్ ప్రభుత్వం అక్కున చేర్చుకుందని వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. వేములవాడ మార్కెట్‌యార్డులో ఏర్పాటు చేసిన యారన్ డిపోలో నేతన్నలకు నూలును అందజేశారు. విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ నేతన్నల ఎన్నో ఏళ్ల కలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చిందన్నారు. గతంలో యారన్ కోసం వెయ్యి కిలోమీటర్ల దూరం వెళ్లి కొనేవారని, ప్రస్తుతం 10 కిలోమీటర్ల దూరంలోనే యారన్ డిపో అందుబాటులోకి వచ్చిందన్నారు. యారన్ డిపోకు ప్రస్తుతం ఉన్న రూ.50కోట్ల బడ్జెట్‌ను రూ.100కోట్లకు పెంచేలా కృషి చేస్తానన్నారు. సిరిసిల్ల బ్రాండ్‌ను పెంచేందుకు నేతన్నలు మరింత కష్టపడాలని కోరారు. జౌళిశాఖ డిప్యూటీ డైరెక్టర్ అశోక్‌రావు, ఏడీ సాగర్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ నాగుల సత్యనారాయణ, ఏఎంసీల చైర్మన్‌లు రొండి రాజు, వెలుమల స్వరూపరెడ్డి, వైస్‌చైర్మన్ కనికరపు రాకేశ్, మున్సిపల్ వైస్‌చైర్మన్ బింగి మహేశ్ పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణలో జిల్లా పోలీస్ భేష్

సిరిసిల్లక్రైం: శాంతిభద్రతల పరిరక్షణలో జిల్లా పోలీస్‌లు బాగా పనిచేస్తున్నారని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కొనియాడారు. పోలీస్ కార్యాలయంలో పోలీస్ దేకు హాజరయ్యారు. ఈ సందర్భంగా పోలీసు జాగిలాల విన్యాసాలు ఆకట్టుకున్నాయి.

విద్య, వైద్యరంగాలకు పెద్దపీట

చందుర్తి(వేములవాడ): విద్య, వైద్యరంగాలకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. చందుర్తిలోని రూ.1.56కోట్లతో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనాన్ని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాతో కలిసి ప్రారంభించి మాట్లాడారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి చలువతోనే ఆరోగ్యశ్రీ పథకం అమలవుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆరోగ్యశ్రీలో వైద్యసేవలను రూ.10లక్షలకు పెంచామన్నారు. చందుర్తి పీహెచ్‌సీని 30 పడకల ఆస్పత్రిగా మార్చేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మండల కేంద్రంలో రూ.2కోట్లతో సెంట్రల్ లైటింగ్ పనులు చేపడతామని తెలిపారు. చందుర్తి–మోత్కురావుపేట రోడ్డు పనులు త్వరలోనే ప్రారంభించనున్నట్లు చెప్పారు. డీఎంహెచ్‌వో వసంతరావు, వేములవాడ ఆర్డీవో రాజేశ్వర్, తహసీల్దార్ శ్రీనివాస్, పీహెచ్‌సీ వైద్యాధికారి సంపత్, నాయకులు చింతపంటి రామస్వామి, తిప్పని శ్రీనివాస్, పొన్నాల శ్రీనివాస్‌రావు, చెలుకల తిరుపతి, బొజ్జ మల్లేశం, నాగం కుమార్ పాల్గొన్నారు.



గన్‌ను పరిశీలిస్తున్న విప్ ఆది శ్రీనివాస్

చెప్పింది చేసి చూపిస్తాం

- అభివృద్ధి లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం
- 20 ఏళ్లలో జరగని పనులు ఏడాదిలోనే పూర్తిచేశాం
- నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపర్చాం
- నియోజకవర్గంలో రూ.280 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టాం
- ఏడాది ప్రజాపాలనపై రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్



Interview

గోదావరిఖని: 'ప్రజాప్రభుత్వంలో ప్రజలకు చెప్పింది చేసి చూపించాం' అని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ అన్నారు. ప్రజాపాలన ఏడాది పూర్తవుతున్న సందర్భంగా 'సాక్షి'కి ఆయన ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. రామగుండం గత 20ఏళ్లుగా అభివృద్ధికి ఆమడదూరంలో ఉంటూ వచ్చిందన్నారు. తాను ఎమ్మెల్యేగా ఎన్నికయ్యాక అహర్నిశలు శ్రమించి నియోజకవర్గ అభివృద్ధికి రూ.280 కోట్లు మంజూరు చేయించానని తెలిపారు. పనులు ప్రారంభమయ్యాయని, ఏడాదిన్నరలోగా ఫలితాలు ప్రజలకు అందుబాటులోకి వస్తాయన్నారు. సింగరేణి, ఆర్ఎఫ్‌సీఎల్, ఎన్టీపీసీ సంస్థల సహకారంతో పారిశ్రామిక ప్రాంతాన్ని అన్నిరంగాల్లో అగ్రగామిగా తీర్చుదిద్దుతామని ఆయన తెలిపారు.

సాక్షి : ఏడాది పాలనలో అభివృద్ధి ఎలా ఉంది?

ఎమ్మెల్యే: ప్రజాపాలనలో రామగుండం అన్ని రంగాల్లో అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోంది. ఇందుకోసం రూ.280 కోట్లు మంజూరయ్యాయి. కొన్ని పనులు ప్రారంభమయ్యాయి. మరి కొన్ని ప్రారంభ దశలో ఉన్నాయి.

సాక్షి : ఎల్లంపల్లి ప్రాజెక్టు ఆధునీకీకరణపై దృష్టి పెట్టారా?

ఎమ్మెల్యే: ఎల్లంపలి ప్రాజెక్టును అధికారికంగా ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. రూ.354 కోట్లతో పాలకుర్తి, ఎల్లంపల్లి ఆధునీకరణపై డీపీఆర్ సిద్ధం చేశాం. ఇది పూర్తయితే పాలకుర్తి, అంతర్గాం ప్రాంతాలకు మూడు పంటలకు సాగునీరు అందుతుంది.

సాక్షి : ఏడాది పాలనలో మీకు సంతృప్తి ఇచ్చినవేమిటి?

ఎమ్మెల్యే: సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సేవలను మా ప్రజాప్రభుత్వం గుర్తించింది. వారికి రూ.5వేలు లాభాల బోనస్ చెల్లించాం. రాష్ట్రమంత్రి శ్రీధర్‌బాబు, డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క సహకారంతో సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లి జీవో 22 అమలు చేసేలా చూస్తాం. 'రుడా' అమలులోకి వస్తే ఒక్కో కార్మికుడి వేతనం నెలకు రూ.4వేల వరకు పెరిగే అవకాశం ఉంటుంది.

సాక్షి : సింగరేణి కార్మిక వాడల కోసం ఏం చేశారు?

ఎమ్మెల్యే: సింగరేణి సంస్థ కేటాయించిన రూ.22 కోట్లతో సింగరేణి ఎస్టీపీ(సీవరేజ్ ప్లాంట్), రూ.5 కోట్లతో అంతర్గత రహదారుల ఆధునీకీకరణ ప్రారంభమైంది. నీటిశుద్ధి ప్లాంటు పనులు కూడా కొనసాగుతున్నాయి.

సాక్షి : ఎన్టీపీసీ ద్వారా ఎన్ని నిధులు మంజూరు చేయించారు?

ఎమ్మెల్యే: అభివృద్ధి పనుల కోసం రూ.3 కోట్లు ఎన్టీపీసీ కేటాయించింది. మరో రూ.7 కోట్లు ఇచ్చేందుకు సిద్ధంగా ఉంది. రూ.20 కోట్లు కావాలని మేం ప్రతిపాదించాం. ఆర్ఎఫ్‌సీఎల్ ద్వారా రూ.3 కోట్లు మంజూరయ్యాయి.

సాక్షి : నర్సింగ్, డెంటల్ కాలేజీల పనుల ప్రగతి ఎలా ఉంది?

ఎమ్మెల్యే: మెడికల్ కాలేజీకి అనుబంధంగా నర్సింగ్ కళాశాల మంజూరైంది. దీనికోసం రూ.26 కోట్లు కేటాయించారు. వీటితోపాటు డెంటల్ కాలేజీ కూడా మంజూరవుతుంది.

సాక్షి : ఎలాంటి అభివృద్ధిపై దృష్టి సారించారు?

ఎమ్మెల్యే: ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రధానంగా దృష్టి సారించాం. సింగరేణి, ఎన్టీపీసీ, ఆర్ఎఫ్‌సీఎల్ సహకారంతో ఇప్పటికే కొన్ని పనులు ప్రారంభమయ్యాయి. అంతర్గత రోడ్లు, యూడీసీలు, ఎస్టీపీలు, పట్టణ సుందరీకరణ, గ్రీన్‌యార్డులు, నర్సింగ్, డెంటల్ కాలేజీలు, 'రుడా' అమలుపై ప్రత్యేక దృష్టి సారించాం.

సాక్షి : రాబోయే నాలుగేళ్లలో వేటికి ప్రాధాన్యం ఇస్తారు?

ఎమ్మెల్యే: నా ఏడాది పాలనలో అభివృద్ధి పనులకు నిధులు మంజూరయ్యేలా పోరాటం చేశా. వచ్చే ఏడాదిలోగా వీటి ఫలితం కనిపిస్తుంది. నా నియోజకవర్గంలోని ప్రధాన నగరం గోదావరిఖనిని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతా. సింగరేణి సహకారంతో పనులు ఇప్పటికే ప్రారంభమయ్యాయి.

సాక్షి : 'రుడా' ఎప్పుడు అమలవుతుంది?

ఎమ్మెల్యే: రామగుండం మున్సిపల్ కార్పొరేషన్.. రామగుండం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(రుడా)గా కావాలనేదే నా లక్ష్యం. దీనికోసం ప్రభుత్వం జీవో విడుదల చేసింది. దాని అమలుకు ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి.

సాక్షి : సింగరేణి రోడ్ల అభివృద్ధి ఎలా ఉంది?

ఎమ్మెల్యే: అధ్వానంగా ఉన్న ఫైవింక్లయిన్ – సెంటినరీకాలనీ రోడ్డు అభివృద్ధికి సింగరేణి రూ.15 కోట్లు కేటాయించింది. ఫైవింక్లయిన్ – జీడీకే–11గని –మంథని మధ్య రోడ్డును మరింత విస్తరిస్తాం. అంతర్గత రోడ్లనూ అభివృద్ధి చేసే చర్యలు వేగవంతమయ్యాయి.

సాక్షి : రోడ్ల విస్తరణ కోసం సింగరేణి క్వార్టర్లు, దుకాణాల కూల్చివేతపై విమర్శలొస్తున్నాయి?

ఎమ్మెల్యే: మేం దుకాణాలు తొలగించడం లేదు. ఆక్రమణలను ప్రభుత్వం లేదా సింగరేణి స్వాధీనం చేసుకుంటున్నాయి. వీటిని ప్రజావినియోగంలోకి తీసుకొస్తాం. చిరు వ్యాపారులకు నష్టం జరగలేదు. నిజమైన నిర్వాసితులు ఉంటే న్యాయం చేస్తాం.

సాక్షి : పర్యాటకంపై ప్రతిపాదనలు ఉన్నాయా?

ఎమ్మెల్యే: ప్రజాప్రభుత్వంలో పర్యాటకంపై ప్రత్యేక దృష్టి సారించాం. రామునిగుండాలు, బుగ్గరామస్వామి, జనగామ త్రిలింగేశ్వరస్వామి ఆలయం, ఎల్లంపల్లి ప్రాజెక్టు, కోటిలింగాలను పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దుతాం.

సాక్షి : యువతకు ఉపాధి కల్పన ఎలా ఉంది?

ఎమ్మెల్యే: నేను ఎన్నికలకు ముందు చెప్పిన విధంగా స్థానికులకే ఉద్యోగాలు నినాదానికి కట్టుబడి ఉన్నా. ఇప్పటికే ఆర్ఎఫ్‌సీఎల్, ఎన్టీపీసీలో ఈవిధానం అమలు చేశాం. సింగరేణి ప్రైవేట్ ఓబీలోని స్థానికేతరులను వారి స్వస్థలాలకు పంపించి వేశాం. వందశాతం స్థానికులకే ఉపాధి కల్పించేలా ప్రణాళిక సిద్ధం చేశాం.

సాక్షి : గోదావరి నది తీరంలో కరకట్ట నిర్మాణం ప్రగతి ఎలా ఉంది?

ఎమ్మెల్యే: గోదావరి నదిపై నిర్మించిన సుందిళ్ల బ్యారేజీ బ్యాక్‌వాటర్‌తో కొన్ని ప్రాంతాలకు ముంపు ముప్పు ఉంది. దాన్ని తప్పించేందుకు గోదావరి వెంట కరకట్ట నిర్మించేందుకు రూ.280 కోట్లలో గతంలో ప్రతిపాదనలు చేశారు. దాని అంచనా వ్యయం రెట్టింపైంది. ఈవిషయంలో ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

ముగిసిన సైన్స్‌ఫేర్

- రాష్ట్రస్థాయికి ప్రాజెక్టులు ఎంపిక
- ప్రశంస పత్రాలు, మెమొంటోలు అందజేత



విద్యార్థులకు ప్రశంసపత్రాలు అందిస్తున్న కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

వేములవాడఅర్బన్: వేములవాడలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న సైన్స్‌ఫేర్ శనివారం ముగిసింది. 68 ఇన్‌స్పైర్ ప్రాజెక్టులు, 400 నమూన ప్రదర్శనలు ప్రదర్శించారు. 800 మంది విద్యార్థులు 250 మంది టీచర్లు పాల్గొన్నారు. ఏడు ప్రాజెక్టులను రాష్ట్రస్థాయికి ఎంపిక చేశారు. సుప్రియ దమ్మన్నపేట, అవంతిక కేజీబీవీ సిరిసిల్ల, అమిత గాలిపెల్లి, శ్రావణ్‌తేజ్ బొప్పాపూర్, భవిత సిరిసిల్ల, శ్రావణి రాజన్నపేట, విశాల్ దమ్మన్నపేట ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. కలెక్టర్ సందీప్ కుమార్ ఝా చేతుల మీదుగా ప్రశంసపత్రాలు అందించారు. జిల్లా విద్యాధికారి జగన్‌మోహన్‌రెడ్డి, జిల్లా సైన్స్ అధికారి పాముల దేవయ్య తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

ఘనంగా సుబ్రహ్మణ్య షష్టి



ముస్తాబాద్(సిరిసిల్ల): శ్రీసుబ్రహ్మణ్యస్వామి షష్టి సందర్భంగా శనివారం ముస్తాబాద్‌లోని అయ్యప్పస్వామి ఆలయ ఆవరణలో రాజుగురుస్వామి ఆధ్వర్యంలో పూజలు చేశారు. పెళ్లీడు యువతులు దోష నివారణ పూజలు చేశారు. అంతకుముందు ఆలయ అర్చకుడు స్వామికి అష్టాభిషేకాలు చేశారు.

ఇంట్లోకి చొరబడిన కొండచిలువ

ఇల్లంతకుంట : మండలకేంద్రంలోని ఒకటో వార్డులో మొలంగూరి రమేశ్ ఇంట్లోకి శనివారం కొండచిలువ చొరబడింది. శనివారం మధ్యాహ్నం కొండచిలువ ఇంట్లోకి వచ్చినట్లు స్థానికులు తెలపగా సాయంత్రం వరకు గాలించారు. చివరికి మెట్ల కింద కనిపించడంతో జీపీ సిబ్బంది చాంద్ పాషా పాషా కొండచిలువను హతమార్చాడు. దీంతో స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు.

ఇద్దరు బైక్ దొంగల రిమాండ్

వేములవాడరూరల్: మూడు బైక్‌ల దొంగతనం కేసులో తప్పించుకుని తిరుగుతున్న ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు వేములవాడ ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి శనివారం ప్రకటనలో తెలిపారు. వేములవాడరూరల్ మండలం బాలరాజుపల్లికి చెందిన ఆసరి శ్రీకాంత్‌కు చెందిన మోటార్‌సైకిల్ 2023 డిసెంబర్‌లో చోరీకి గురైంది. కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టారు. కోనరావుపేట మండలం రామన్నపేటకు చెందిన దుద్దెడి వేణు, గరువుల దేవేందర్ మోటార్‌సైకిల్ చోరీ చేసినట్లు గుర్తించి వేములవాడరూరల్ మండలం మర్రిపల్లిలో అరెస్టు చేశారు. మరో నిందితుడు మామిండ్ల రాకేశ్ పరారీలో ఉన్నట్లు తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండల కేంద్రంలో తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగింది. పోలీసులు, స్థానికుల వివరాలు.. మండల కేంద్రానికి చెందిన కోడం విజయ 15 రోజుల క్రితం ఇంటికి తాళం వేసి మహారాష్ట్ర వెళ్లింది. కాగా శనివారం ఇంటి తాళం పగులగొట్టి ఉండడం గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. బాధితురాలికి చోరీ విషయం తెలుపడంతో బీరువాలో రూ.లక్ష నగదు పోయినట్లు గుర్తించింది. ఎస్సై రామ్మోహన్ చోరీ జరిగిన ఇంటిని పరిశీలించారు.

సైన్స్‌ఫేర్‌లో విద్యార్థిని ప్రతిభ



కలెక్టర్ చేతుల మీదుగా బహుమతి అందుకుంటున్న మైథిలీ

ముస్తాబాద్(సిరిసిల్ల): 52వ ఇన్‌స్పైర్ వైజ్ఞానిక ప్రదర్శనలో ముస్తాబాద్ జెడ్పీ ఉన్నత బాలికల పాఠశాల విద్యార్థి గంప మైథిలీ మొదటి స్థానంలో నిలిచిందని హెచ్‌ఎం రవీందర్ తెలిపారు. 'ప్రకృతి వైపరీత్యాలను ఎలా ఎదుర్కోవాలి' అనే అంశంపై 'ట్రాన్స్‌ఫార్మేషన్ ఆఫ్ ఎయిర్ పొల్యూషన్ ఇంటు నేచురల్ గ్యాస్' అనే ప్రాజెక్టును గైడ్ రాజ్‌మహ్మద్ సహకారంతో ప్రదర్శించినట్లు వివరించారు. దీనికి జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం దక్కిందని తెలిపారు. కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా చేతుల మీదుగా అవార్డు, ప్రశంసాపత్రం అందుకున్నారు.

పోలీస్ కావాలని..

- కలలు కన్నారు.. కొలువు కొట్టారు
- లక్షల ప్యాకేజీలు వదిలి కొందరు..
- ప్రభుత్వ ఉద్యోగం కాదని మరికొందరు
- తల్లిదండ్రుల ప్రోత్సాహంతో విద్యావంతులు
- ఖాకీ ఉద్యోగానికి మొగ్గు
- ఆయా ఠాణాల్లో విధుల్లో చేరిన కానిస్టేబుళ్లు

పోలీస్ ఉద్యోగంపై మక్కువ.. సమాజ సేవ చేయడమే ధ్యేయంగా.. ఉన్నత చదువులు చదివి పట్టుదలతో ఖాకీ కొలువు సాధించారు. ఇందులో కొందరు ప్రైవేట్ కంపెనీల్లో లక్షల రూపాయల ప్యాకేజీలు.. ఇంకొందరు ప్రభుత్వ ఉద్యోగాలను వదులకున్నారు. మరికొందరు తల్లిదండ్రుల ప్రోత్సాహంతో లక్ష్యాన్ని చేరుకున్నారు.. ఇటీవల శిక్షణ పూర్తి చేసుకొని పలు పోలీస్ స్టేషన్‌లలో విధుల్లో చేరిన కానిస్టేబుళ్లపై కథనం.

సమాజ సేవ అంటే ఇష్టం



జ్యోతినగర్(రామగుండం): అమ్మానాన్న లక్ష్మి–రాజేశంకు మేము ముగ్గురం కూతుళ్లం. నాన్న చిన్న వ్యాపారం చేస్తూ అందరినీ చదివిపించారు. బీటెక్ పూర్తి చేసిన. సమాజ సేవ అంటే ఇష్టం. ప్రభుత్వ ఉద్యోగం చేయాలనే తపనతో పోటీ పరీక్షలకు ప్రిపేర్ అయ్యాను. ఈ క్రమంలో కానిస్టేబుల్‌గా ఎంపికయ్యాను. హైదరాబాద్‌లోని అప్పాలో శిక్షణ పూర్తయింది. ఎన్టీపీసీ పోలీస్ స్టేషన్‌లో విధుల్లో చేరిన. పోలీసు ఉద్యోగంతో ప్రజలకు సేవ చేసే అవకాశం రావడం సంతోషంగా ఉంది.

– తూర్పాటి సాయిలత, నారాయణపూర్, సుల్తానాబాద్

పట్టుదలతో చదివిన..



మాది గోదావరిఖని. అమ్మ లక్ష్మి గృహిణి. నాన్న శంకర్ లారీ యజమాని. ఇద్దరం కూతుర్లం. కాకతీయ యూనివర్సిటీలో ఎంబీఏ చేశాను. ప్రభుత్వ ఉద్యోగం సాధించాలని పట్టుదల ఏర్పడింది. ఈ క్రమంలో కానిస్టేబుల్ పోటీ పరీక్షలకు హాజరయ్యాను. ఎంపికై హైదరాబాద్‌లో శిక్షణ పొందాను. ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్‌లో విధుల్లో చేరిన.

– మాదాసు సౌమ్య, మహిళా కానిస్టేబుల్, ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్

చిన్ననాటి నుంచి..



తల్లిదండ్రులతో వెంకటేశ్

జగిత్యాలక్రైం: చిన్ననాటి నుంచి పోలీసు కావాలనే లక్ష్యంతో చదివా. గ్రూప్–4 ఉద్యోగం వచ్చినా వదులుకుని కానిస్టేబుల్ కొలువు సాధించా. నాన్న మల్లేశం కల్లుగీత కార్మికుడు. అమ్మ వ్యవసాయం చేస్తూ నన్ను బీటెక్ వరకు చదివించారు. ఆదిలాబాద్ పీటీసీలో 9 నెలల పాటు శిక్షణ పూర్తి చేసుకున్న. జగిత్యాల పట్టణ పోలీస్‌స్టేషన్‌లో మొదటి పోస్టింగ్ వచ్చింది.

– గర్వంద వెంకటేశ్, గుల్లకోట, వెల్గటూర్

పదిలక్షల ప్యాకేజీ వదులుకున్న



కుటుంబ సభ్యులతో వంశీ

ఏదైనా ప్రభుత్వ ఉద్యోగం సాధించాలన్న ఉద్దేశంతో చిన్ననాటి నుంచి అమ్మానాన్న వెంకటేశ్–లత వ్యవసాయం చేసుకుంటూ చదివించారు. బీటెక్ పూర్తికాగానే ఓ ప్రైవేటు సాఫ్ట్‌వేర్ కంపెనీలో రూ.10 లక్షల ప్యాకేజీతో ఉద్యోగం వచ్చింది. కానీ నేను దానిని వదిలిపెట్టి కానిస్టేబుల్ ఉద్యోగం సాధించా. ఆదిలాబాద్ పీటీసీలో 9 నెలల శిక్షణ పూర్తి చేసుకున్న. శిక్షణలో జగిత్యాల జిల్లా మొదటి స్థానం సాధించి ప్రశంసాపత్రాలు అందుకున్న. జగిత్యాల పట్టణ పోలీస్‌స్టేషన్‌లో విధుల్లో చేరిన.

– బాదినేని వంశీ, పెంబట్ల, సారంగాపూర్

గ్రూప్–4 ఉద్యోగం వదిలి..



చిన్ననాటి నుంచి అమ్మానాన్న నర్సింహారెడ్డి–రాధ వ్యవసాయం చేసుకుంటూ నన్ను చదివించారు. పట్టుదలతో బీటెక్ పూర్తిచేసి సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఏడాదికి రూ.6 లక్షల ప్యాకేజీతో రెండేళ్లు పనిచేసిన. ప్రభుత్వ ఉద్యోగం సాధించాలని గ్రూప్–4 కొలువు కొట్టిన. దానిని వదులుకుని కానిస్టేబుల్ ఉద్యోగం సాధించా. 9 నెలల పాటు ఆదిలాబాద్ పీటీసీలో శిక్షణ పూర్తి చేసుకున్న. జగిత్యాల పట్టణ పీఎస్‌లో విధుల్లో చేరిన.

– ఎమ్మిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, వట్టెంల, వేములవాడరూరల్, రాజన్న సిరిసిల్ల

నాడు దేశసేవ.. నేడు ప్రజాసేవ



గోదావరిఖని(రామగుండం): మాది రామగిరి మండలం ఆదివారంపేట. దేశ సరిహద్దుల్లో 17 ఏళ్ల పాటు విధులు నిర్వహించి సేవ చేసిన. కానిస్టేబుల్ పరీక్షలకు హాజరై ఉత్తీర్ణత సాధించా. గోదావరిఖని వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న.

– కొమ్ము సతీశ్, గోదావరిఖని వన్‌టౌన్

అండగా నిలిచిన తైక్వాండో



కోచ్‌తో లహరి,

చొప్పదండి: మాది చొప్పదండి పట్టణం. నాన్న జుంజూరి శంకరయ్య ఆటో డ్రైవర్. అమ్మ బీడీ కార్మికురాలు. ఒక చెల్లి చదువుకుంటోంది. పాఠశాల స్థాయి నుంచి ఆత్మరక్షణకు నేర్చుకున్న విద్య ప్రభుత్వ కొలువు సాధించేందుకు దోహదపడింది. తైక్వాండో శిక్షణ పొందడమే కాకుండా, విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన. ప్రభుత్వం ప్రకటించిన కానిస్టేబుల్ ఉద్యోగాలకు క్రీడా విభాగంలో అర్హత ఉండటంతో దరఖాస్తు చేసిన. పట్టుదలతో చదివి కానిస్టేబుల్ కొలువు సాధించా. హైదరాబాద్‌లో శిక్షణ పొంది, కరీంనగర్ టూటౌన్‌లో విధుల్లో చేరిన.

– లహరి, చొప్పదండి

పోలీస్ ఉద్యోగం అంటే మక్కువ



సుల్తానాబాద్(పెద్దపల్లి): బీకాం చదివి 2012 బ్యాచ్‌లో హోంగార్డుగా ఎంపికయిన. భర్త ప్రోత్సాహంతో కానిస్టేబుల్ ఉద్యోగానికి దరఖాస్తు చేసి కొలువు సాధించా. పోలీస్ ఉద్యోగం అంటే మా ఇంట్లో అందరికీ ఇష్టం. హైదరాబాద్‌లో శిక్షణ పూర్తయింది. సుల్తానాబాద్ పోలీస్ స్టేషన్‌లో విధుల్లో చేరిన. భవిష్యత్‌లో ఉన్నత ఉద్యోగం సాధించడమే లక్ష్యం.

– మిట్టపల్లి రేణుక, సుల్తానాబాద్

తండ్రి ఆశయం కోసం



గన్నేరువరం(మానకొండూర్): మాది కరీంనగర్‌లోని రేకుర్తి. తల్లిదండ్రులు అస్తపురం రాజనర్సయ్య–వసంత దంపతులకు ఇద్దరు కూతుర్లం. ఎంఎస్ మ్యాథమెటిక్స్ చేసిన. తండ్రి ప్రోత్సాహంతో తొలి ప్రయత్నంలోనే కానిస్టేబుల్ ఉద్యోగం సాధించా. ఉద్యోగం కోసం పెళ్లి కూడా వాయిదా వేసుకున్న. ఆగస్టులో హైదరాబాద్‌లో శిక్షణలో ఉండగానే నాన్న అనారోగ్యంతో మృతిచెందారు. నాన్న ఆశయం నేరవేర్చినందుకు సంతోషంగా ఉంది. అలాగే కొడుకులు లేని లోటు తీర్చానని అమ్మ కూడా ఆనందంగా ఉంది.

– అస్తపురం శ్రీలత, కానిస్టేబుల్ గన్నేరువరం

పట్టువీడని సంకల్పం



శంకరపట్నం(మానకొండూర్): పోలీస్ ఉద్యోగం చేయాలన్న నా సంకల్పం రెండో ప్రయత్నంలో నెరవేరింది. మాది మానకొండూర్ మండలం చెంజర్ల. తల్లిదండ్రులు సూదగోని రాజమల్లు–లక్ష్మి. ఎంటెక్ చదివిన. ప్రైవేట్ టీచర్‌గా ఉద్యోగం చేస్తూ గతంలో కానిస్టేబుల్ కొలువుకు ప్రిపేర్ కాగా రాలేదు. ప్రస్తుతం రెండో ప్రయత్నంలో ఉద్యోగం సాధించి హైదరాబాద్‌లో శిక్షణ పూర్తి చేసుకున్న. కేశవపట్నం ఠాణాలో విధుల్లో చేరిన.

– సూదగోని సమత

వేములవాడలో కోడెల వార్

- ఈవో చాంబర్ ముట్టడించిన బీజేపీ, బీఆర్‌ఎస్ నాయకులు
- బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్



రాజన్న ఆలయ ఈవో చాంబర్ వద్ద నిరసన తెలుపుతున్న బీజేపీ, బీఆర్‌ఎస్ నాయకులు

వేములవాడ: రాజన్నకు భక్తులు భక్తితో సమర్పించే కోడెలపై వార్ నెలకొంది. గోశాల నుంచి నిబంధనలకు విరుద్ధంగా ఒకే రైతుకు 60 కోడెలు ఇవ్వడాన్ని నిరసిస్తూ బీజేపీ, బీఆర్‌ఎస్ నాయకులు శనివారం ఆందోళనకు దిగారు. ఈవో చాంబర్ ముందు బైఠాయించి నిరసన తెలిపారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాగా జరిగిన ఘటనపై నాయకులకు ఏఈవో శ్రవణ్ వివరించారు. అనంతరం ఇరుపార్టీల నాయకులు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాలను అందజేశారు.

నిబంధనల మేరకు పంపిణీ

: కొండ సురేఖ, మంత్రి

రాజన్న ఆలయంలో నిబంధనల ప్రకారం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ఉన్న కమిటీ సూచనల మేరకు కోడెల పంపిణీ జరుగుతుందని, తమపై గిట్టని వారు లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని మంత్రి కొండ సురేఖ శనివారం ప్రకటనలో పేర్కొన్నారు. రైతులకు నేరుగా అందించే కార్యక్రమాన్ని తమ ప్రభుత్వం చేపట్టిందని స్పష్టం చేశారు. గోశాల అభివృద్ధికి నిధులు సైతం కేటాయించామని తెలిపారు.

బాధ్యులపై చర్యలు తీసుకోండి

రెండుమూడు రోజులుగా పత్రికల్లో వస్తున్న కథనాల ద్వారా గీసుకొండ మండలం మనకొండ గ్రామంలో రాజన్న కోడెలను అనామకమైన గోశాలకు కేటాయించడం సరికాదు. వాటిని కోబేలాకు తరలించారని వస్తున్న వార్త కథనాలు భక్తుల మనోభావాలను దెబ్బతీస్తున్నాయి. రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి సిఫారసు లెటర్‌తో రాజన్న కోడెలను వేములవాడ నుంచి తరలించడం దారుణం. ఈ ఘటనపై కలెక్టర్‌చే విచారణ జరిపించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి.

– రేగుల సంతోష్‌బాబు, బీజేపీ పట్టణ అధ్యక్షుడు

విచారణ తర్వాతే అప్పగిస్తున్నం

రాజన్నకు సమర్పించుకునే నిజ కోడెలను తమకు వచ్చిన దరఖాస్తులను పరిశీలించిన తర్వాతే వాటి చెవికి ట్యాగ్ ఏర్పాటు చేసి జిల్లా అధికారుల కమిటీ సూచనల మేరకు రైతులకు అప్పగిస్తున్నాం. గోసంరక్షణ సూచనల మేరకే తాము నిబంధనలు పాటిస్తున్నాం. సొసైటీలకు అప్పగించడం లేదు. ఎక్కడైనా మిస్‌యూజ్ జరిగితే క్రిమినల్ చర్యలు తీసుకుంటాం. సంరక్షించే పరిస్థితి లేకుంటే తిరిగి తమకే అప్పగించాలని విజ్ఞప్తి చేస్తున్నాం. సంరక్షించే కోడెలు చనిపోతే లాంఛనం ప్రకారం ఖననం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నాం.

– కొప్పుల వినోద్‌రెడ్డి, ఈవో

కోడెలను రక్షించాలి

రైతులు, భక్తులు ఎంతో భక్తితో సమర్పించే కోడెలను రక్షించాల్సిన ఆలయ అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారు. ఒక్క వ్యక్తికే రాజన్న కోడెలను అందించడాన్ని తాము తీవ్రంగా నిరసిస్తున్నాం. జిల్లా కలెక్టర్ విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలి. ఈవో వినోద్‌రెడ్డికి పార్టీ తరఫున వినతిపత్రం సమర్పించాం.

– మున్సిపల్ చైర్‌పర్సన్ మాధవి, ఏఎంసీ మాజీ చైర్మన్ ఏనుగు మనోహర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు

ట్రాన్స్‌జెండర్లు, దివ్యాంగులకు శాశ్వత ఉపాధి

- ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్
- సిరిసిల్లలో ట్రాన్స్‌జెండర్స్ పెట్రోల్‌బంక్ ప్రారంభం



పెట్రోల్‌బంక్ ప్రారంభిస్తున్న విప్, కలెక్టర్‌లు

సిరిసిల్ల: దేశంలోనే తొలిసారిగా ట్రాన్స్‌జెండర్లు, దివ్యాంగుల ఉపాధికి పెట్రోల్‌బంక్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని మెడికల్ కాలేజీ సమీపంలోని బైపాస్‌రోడ్డులో రూ.4.50 కోట్లతో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ పెట్రోల్‌బంక్‌ను చొప్పదండి, మానకొండూరు ఎమ్మెల్యేలు మేడిపల్లి సత్యం, కవ్వంపల్లి సత్యనారాయణ, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాలతో కలిసి శనివారం ప్రారంభించారు. విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ ట్రాన్స్‌జెండర్లు, దివ్యాంగులు, మహిళల శాశ్వత స్వయం ఉపాధికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ వాహనాలకు ఈ పెట్రోల్‌బంక్‌లోనే ఆయిల్ పోయించుకుని నిర్వాహకులకు అండగా నిలవాలని కోరారు. జిల్లా కలెక్టర్ చొరవతో రూ.2కోట్ల విలువైన స్థలాన్ని ప్రభుత్వం సమకూర్చగా.. రూ.2.50కోట్లతో ఆయిల్ కంపెనీ పెట్రోల్‌బంక్‌ను ఏర్పాటు చేసింది. ఈ పెట్రోల్‌బంక్ ద్వారా 24 మంది ట్రాన్స్‌జెండర్లు, దివ్యాంగులు ఉపాధి పొందనున్నారు. అదనపు కలెక్టర్ ఎన్.ఖీమ్యానాయక్, జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజం, జిల్లా గ్రంథాలయసంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ, సిరిసిల్ల మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ స్వరూపరెడ్డి ఉన్నారు.

అసెంబ్లీలో మాజీ సర్పంచుల సమస్యలు లేవనెత్తుతా

- బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- సమస్యలు విన్నవించిన మాజీ సర్పంచులు



హైదరాబాద్‌లో కేటీఆర్‌ను కలిసిన మాజీ సర్పంచులు

సిరిసిల్ల: అసెంబ్లీ సమావేశాల్లో మాజీ సర్పంచుల సమస్యలు, పెండింగ్ బిల్లుల అంశాన్ని లేవనెత్తుతానని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కె.తారక రామారావు పేర్కొన్నారు. హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో జిల్లాకు చెందిన మాజీ సర్పంచులు కేటీఆర్‌ను శనివారం కలిసి తమ సమస్యలు వివరించారు. తమ పదవీకాలంలో గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనుల బిల్లుల గురించి అసెంబ్లీలో ప్రస్తావించాలని కోరారు. ప్రభుత్వ ఆదేశాలతో పల్లెప్రగతి, రైతువేదిక, వైకుంఠధామం, డంపింగ్‌యార్డ్, పల్లె ప్రకృతి వనాలు వంటి పనులు చేశారని కేటీఆర్ గుర్తు చేశారు. ఏడాదిగా పోరాతున్న ప్రభుత్వం స్పందించకపోవడం దురదృష్టమన్నారు.



కూనంనేనికి విన్నవిస్తున్న మాజీ సర్పంచులు

'కూనంనేని'కి వినతి

సిరిసిల్లటౌన్: మాజీ సర్పంచ్‌ల పెండింగ్ బిల్లులపై అసెంబ్లీలో మాట్లాడాలని జిల్లా మాజీ సర్పంచుల ఫోరం ఆధ్వర్యంలో సీపీఐ ఫ్లోర్ లీడర్ కూనంనేని సాంబశివరావును కోరారు. శనివారం హైదరాబాద్‌లో కూనంనేని సాంబశివరావుతోపాటు ఎంఐఎం ఎమ్మెల్యే జుల్ఫేకర్ అలీ తదితరులను కలిసి విన్నవించారు. కలిసిన వారిలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ తుల ఉమ, జెడ్పీ మాజీ వైస్‌చైర్మన్ సిద్దం వేణు, మాజీ సర్పంచులు గాండ్ల సుమతి, మల్యాల దేవయ్య, కెంద గంగాధర్, దుమ్మ అంజయ్య, చాకలి రమేశ్, బొజ్జం మల్లేశం, మల్యాల దేవయ్య, గున్నాల లక్ష్మణ్, కోల నర్సయ్య, ఆరె మహేందర్, గాండ్ల సుమతి, తాడెపు ఎల్లం ఉన్నారు.

ఢిల్లీలో సిరిసిల్ల వ్యాపారి అదృశ్యం

సిరిసిల్ల: రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రం నెహ్రూనగర్‌కు చెందిన వ్యాపారి వడ్డెపల్లి లక్ష్మీకాంత్(36) హైదరాబాద్ అల్వాల్‌లో ఉంటూ.. హోటల్, రెస్టారెంట్ వ్యాపారం నిర్వహిస్తారు. అతను ఇటీవల ఢిల్లీకి వెళ్లి అదృశ్యమయ్యాడు. ఢిల్లీ నుంచి వస్తున్నానని భార్య అర్పితకు ఈ నెల 4న ఫోన్ చేసిన లక్ష్మీకాంత్ ఇంటికి రాలేదు. దీంతో అతడి భార్య హైదరాబాద్‌లోని అల్వాల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. మిస్సింగ్ కేసు నమోదు చేసిన పోలీసులు ఫోన్ కాల్ డేటా ఆధారంగా విచారణ జరుపుతున్నారు. లక్ష్మీకాంత్ అదృశ్యమైనట్లు తెలియడంతో సిరిసిల్లలో అతన్ని నమ్మి అప్పులు ఇచ్చినవారు ఆయన ఇంటికి వెళ్లి తల్లిదండ్రులను వాకబు చేసినట్లు సమాచారం. లక్ష్మీకాంత్‌కు రూ.లక్షల్లో అప్పులు ఇచ్చిన వారు సిరిసిల్ల పోలీసులను ఆశ్రయించారు. సిరిసిల్ల పాత బస్టాండులోనూ ఓ రెస్టారెంట్‌ను ఇటీవలే ప్రారంభించిన లక్ష్మీకాంత్ అది నడవకపోవడంతో ఆర్థికంగా నష్టపోయినట్లు భావిస్తున్నారు. హైదరాబాద్, గజ్వేల్ ప్రాంతాల్లోనూ హోటళ్లను పెట్టాడు. మొత్తంగా రూ.కోట్లలో నష్టపోయిన సదరు వ్యాపారి ఇప్పుడు అదృశ్యం కావడంతో అతన్ని నమ్మి అప్పులు ఇచ్చిన వారు ఆందోళనకు గురవుతున్నారు. వ్యాపారి అదృశ్యం సిరిసిల్లలో చర్చనీయాంశమైంది.

జనాభా ప్రకారం రిజర్వేషన్లు కల్పించండి

- బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శ హన్మాండ్లు



సిరిసిల్ల: వెనకబడిన వర్గాల(బీసీల) న్యాయబద్ధమైన ప్రధాన సమస్యలపై అధ్యయనం చేసి అమలుకు సిఫార్సు చేయాలని బీసీ డెడికేటెడ్ కమిషన్ చైర్మన్ బి.వెంకటేశ్వరరావుకు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శ హన్మాండ్లు వినతిపత్రం అందించారు. కరీంనగర్ కలెక్టరేట్‌లో శనివారం నిర్వహించిన బహిరంగ విచారణలో పాల్గొన్నారు. స్థానిక సంస్థల్లో బీసీలకు జనాభా దామాషా ప్రకారం రాజకీయంగా 42 శాతం రిజర్వేషన్‌లు కల్పించాలని కోరారు. సహకార బ్యాంకు ఎన్నికలల్లోనూ బీసీ రిజర్వేషన్లను అమలు చేయాలని, దళిత్ ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (డిక్కీ) తరహాలో బీసీ ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ(బిక్కీ) ఏర్పాటు చేయాలని కోరారు. జిల్లా అధ్యక్షుడు వీరవేని మల్లేశ్‌యాదవ్, సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు తడుక కమలాకర్, నాయకులు కందుకూరి రామాగౌడ్, బచ్చు ప్రసాద్, సామల తిరుపతి, కొండ విజయ్, చిందం శ్రీధర్ ఉన్నారు.

జిల్లా కబడ్డీ అసోసియేషన్ చైర్మన్ 'ఆది'

సిరిసిల్లటౌన్: జిల్లా కబడ్డీ అసోసియేషన్ జనరల్ బాడీ కార్యవర్గం శనివారం ఎన్నికైంది. చైర్మన్‌గా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, ప్యాట్రన్‌గా కేకే మహేందర్‌రెడ్డి, వైస్ చైర్మన్‌గా చొప్పదండి ప్రకాశ్, జిల్లా అధ్యక్షుడిగా ముస్కు మల్లారెడ్డి, వైస్ ప్రెసిడెంట్‌గా బొడ్డు రాములు, సెక్రటరీగా సింగారపు తిరుపతి, సలహాదారులుగా పీఈటీ మల్లయ్య, కోశాధికారిగా దేవత ప్రభాకర్ ఎన్నికయ్యారు. ఎన్నికలకు ఉమ్మడి జిల్లా ఒలింపిక్ అబ్జర్వర్ సంపత్‌రావు, ఉమ్మడి జిల్లా ఎన్నికల అధికారులు లక్ష్మీనారాయణగౌడ్, స్టేట్ అబ్జర్వర్‌గా బుర్ర మల్లేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

వేములవాడ : మేడిపల్లి మాజీ జెడ్పీటీసీ, మాజీ ఎంపీపీ, మాజీ సర్పంచులు, వివిధ పార్టీల నేతలు, వారి అనుచరులతో ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్ సమక్షంలో శనివారం కాంగ్రెస్‌లో చేరారు. రానున్న ఎన్నికల్లో మేడిపల్లి, భీమారం మండల పరిధిలో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేస్తామని పేర్కొన్నారు.

నంబర్‌ప్లేట్ లేని వాహనం పట్టివేత



పోలీసులు స్వాధీనం చేసుకున్న వాహనం

ముస్తాబాద్(సిరిసిల్ల): ముస్తాబాద్‌లో ఎస్సై గణేశ్ ఆధ్వర్యంలో శనివారం వాహనాల తనిఖీలు చేపట్టగా.. ఓ డ్రైవర్ బోలెరో వాహనాన్ని వదిలి పారిపోయాడు. సదరు వాహనానికి నంబర్ ప్లేట్ లేదని, మార్ఫింగ్ చేశారని ఎస్సై వివరించారు. సగం నంబర్ కనిపించి కనిపించకుండా ఉందని, వాహనాన్ని ఠాణాకు తరలించామన్నారు. వాహనం డ్రైవర్‌పై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

'ప్రసన్న హరికృష్ణకు మద్దతు'

సిరిసిల్లటౌన్: రాబోయే కరీంనగర్–అదిలాబాద్–నిజామాబాద్–మెదక్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీసీ అభ్యర్థి, అసిస్టెంట్ ప్రొఫెసర్, విన్నర్స్ పబ్లికేషన్స్ సలహాదారు, ప్రసన్న హరికృష్ణకు బీసీ సంక్షేమ సంఘం మద్దతు ప్రకటించింది. ఈ మేరకు శనివారం సిరిసిల్లలో నిర్వహించిన సమావేశంలో బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు దండు వినోద్, బీసీ సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వంగ వంశీకృష్ణ మాట్లాడారు. విద్యావేత్త ప్రసన్న హరికృష్ణకు బీసీ సంఘాలు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నాయన్నారు. అబ్బసాని సందీప్, నవీన్, వంగ మహేందర్, నిశాంత్, రాజు, ప్రణయ్, శేఖర్, మనోహర్, అజయ్ పాల్గొన్నారు

ఐటీఐలో అప్రెంటీస్‌షిప్ మేళా

సిరిసిల్లకల్చరల్: తంగళ్లపల్లి మండలంలోని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ (ఐటీఐ)లో సోమవారం జాతీయ అప్రెంటీస్‌షిప్ మేళా నిర్వహిస్తున్నట్లు సంస్థ ప్రిన్సిపాల్ కవిత ఒక ప్రకటనలో తెలిపారు. 2023 నాటికి ఫిట్టర్, ఎలక్ట్రీషియన్, మెకానికల్ డిజిల్, మెకానిక్ మోటార్ వెహికిల్, వెల్డర్ ట్రేడ్‌లలో ఐటీఐ ఉత్తీర్ణులైన అభ్యర్థులకు వివిధ ఆటోమొబైల్ కంపెనీల్లో అవకాశాలు కల్పించనున్నట్లు వెల్లడించారు. ఆదర్శ ఆటోమోటివ్స్, వరలక్ష్మి, ఫెనెస్టా బిల్డింగ్ సిస్టమ్స్, ఆరిఫ్ మోటార్స్, జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్స్ తదితర సంస్థల్లో అవకాశాలున్నాయని పేర్కొన్నారు. ఆసక్తి గల ఐటీఐ ఉత్తీర్ణులు విద్యార్హతల ధ్రువపత్రాలు, ఆధార్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రంతో హాజరు కావచ్చన్నారురర. మరిన్ని వివరాలకు 86886 12666 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

రాజన్న సేవలో ఏపీ హైకోర్టు జడ్జి



కోడె మొక్కు చెల్లించుకుంటున్న హైకోర్టు జడ్జి వెంకట జ్యోతిర్మయి ప్రతాప

వేములవాడ: రాజన్నను ఏపీ హైకోర్టు జడ్జి జస్టిస్ వెంకటజ్యోతిర్మయి ప్రతాప కుటుంబ సభ్యులతో శనివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వేములవాడ జూనియర్ సివిల్ జడ్జి జ్యోతిర్మయి పూలమొక్క అందించి స్వాగతం పలికారు. జిల్లా పోలీసులు గౌరవ వందనం సమర్పించారు. హైకోర్టు జడ్జి కుటుంబ సభ్యులకు అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. అద్దాల మండపంలో స్వామివారి ప్రసాదాన్ని ఏఈవో శ్రవణ్ అందించారు. సిద్దిపేట జిల్లా ప్రిన్సిపల్ జడ్జి సాయిరమాదేవి, టౌన్ సీఐ వీరప్రసాద్, ఎస్సై అంజయ్య ఉన్నారు.

రాజన్నను దర్శించుకున్న డెడికేషన్ కమిషన్ చైర్మన్

వేములవాడ రాజన్నను డెడికేషన్ కమిషన్ చైర్మన్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి వెంకటేశ్వర్‌రావు శనివారం దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న ఆయనకు ఆలయ ఈవో వినోద్‌రెడ్డి, అర్చకులు ఘనస్వాగతం పలికారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేదోక్త ఆశీర్వచనం చేశారు. ఆయనవెంట ఏఈవో శ్రవణ్, పర్యవేక్షకులు తిరపతిరావు ఉన్నారు.

ఆటోల బంద్ విజయవంతం



ధర్నాలో పాల్గొన్న బీఆర్టీయూ నాయకులు

సిరిసిల్లటౌన్/ఎల్లారెడ్డిపేట/గంభీరావుపేట/ఇల్లంతకుంట/కోనరావుపేట: జిల్లా వ్యాప్తంగా శనివారం చేపట్టిన ఆటోలబంద్ విజయవంతమైంది. ఆటోలు రోడ్డెక్కలేదు. భారత రాష్ట్ర ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు వెంగళ శ్రీనివాస్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళలకు ఉచిత బస్సు ఏర్పాటుతో ఆటో కార్మికుల ఉపాధి దెబ్బతీసిందన్నారు. మేనిఫెస్టోలో పెట్టినట్లుగా ఏడాదికి రూ.12వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆత్మహత్యలు చేసుకున్న ఆటోకార్మికుల కుటుంబాలకు రూ.10లక్షలు ఇచ్చి ఆదుకోవాలని కోరారు. ఆటో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.